ఒళ్లు, బళ్లు గుల్ల



నూజివీడు నుంచి ముసునూరు వెళ్లే మార్గంలో సింహాద్రిపురం వద్ద రహదారిపై పడిన గుంతలు



ముసునూరు మండలం గోపవరం సమీపంలోని నాగేంద్రపురం సెంటర్‌లో పడిన భారీ గుంత

- అధ్వానంగా నూజివీడు- ఏలూరు వయా ముసునూరు రహదారి
- మంత్రి ఉన్నా బాగుపడని రోడ్లు
- ప్రయాణానికి తప్పని తిప్పలు

నూజివీడు: సంక్రాంతి వెళ్లి 9 నెలలు గడిచినా గుంతల రోడ్డుకు మోక్షం లభించలేదు. దీనికి నూజివీడు నుంచి ముసునూరు, గోపవరం మీదుగా ఏలూరు వెళ్లే రహదారి తార్కాణంగా నిలుస్తోంది. రాష్ట్ర మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నూజివీడు నియోజకవర్గంలోని ప్రధాన రహదారి ఇంత దారుణంగా ఉండటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 15 నెలలు గడిచినా ఇంతవరకు రోడ్డుపై గుంతలు పూడ్చకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.
నూజివీడు నుంచి ముసునూరుతో పాటు గోపవరం, వేల్పుచర్ల, బలివే, కాట్రేనిపాడు, సింహాద్రిపురం, కొర్లగుంట, చింతలవల్లి, గోగులంపాడు తదితర గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి అడుగడుగునా గుంతలమయంగా దర్శనమిస్తోంది. ఈ రోడ్లపై ప్రయాణానికి వాహన చోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రానికి వెళ్లే రోడ్డే కాకుండా నూజివీడు నుంచి ఏలూరు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో ఈ మార్గంలో నిత్యం భారీ వాహనాలతో పాటు బస్సులు, ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు, వ్యవసాయ పనుల నిమిత్తం ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే అడుగడుగునా భారీ గుంతలు ఏర్పడటంతో వాటిని తప్పించే క్రమంలో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. దీంతో వాహనదారులు కింద పడి గాయాలపాలవుతున్నారు.

రైతులకు తప్పని సర్కస్ ఫీట్లు

పలు గ్రామాల్లో రైతులు కూరగాయల పంటలు సాగు చేస్తున్నారు. దిగుబడి వచ్చిన తరువాత కూరగాయల బస్తాలను ద్విచక్ర వాహనానికి కట్టుకొని నూజివీడులోని మార్కెట్‌కు తీసుకువచ్చి విక్రయిస్తారు. రహదారి అధ్వానంగా ఉండటంతో రైతులు కూరగాయల మూటలు కట్టుకొని గుంతల రోడ్డుపై సర్కస్ ఫీట్లు చేస్తూ నూజివీడుకు చేరుకుంటున్నారు. గుంత పక్కన గుంత పడి నరకానికి నకళ్లుగా మారాయి. ఈ రహదారికి మరమ్మతులు చేయించాలని గతంలో పలుమార్లు సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనను సైతం నిర్వహించారు. ఇంత జరుగుతున్నా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి కనీసం తాత్కాలిక మరమ్మతులను చేపట్టడం లేదు. మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ ఈ రోడ్డును చూసి పేరుకే మంత్రిగా ఉన్నారేమోననే సందేహాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

ప్రయాణం నరకమే..

నూజివీడు నుంచి ముసునూరుకు ఉన్న 10 కిలో మీటర్ల దూరానికి ఈ రహదారిలో కారులో ప్రయాణించాలంటే కనీసం ముప్పావు గంట పడుతోందని వాహన చోదకులు వాపోతున్నారు. అంతేగాకుండా భారీ గుంతల్లో తిరగడం వల్ల తమ వాహనాలు త్వరగా మరమ్మతులకు గురవుతున్నాయని ఆటోవాలాలు, కార్ల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముసునూరు మండలం సింహాద్రిపురంలో ప్రధాన రహదారి పూర్తిగా పాడైపోయి భారీ గుంతలు పడటంతో ఈ గుంతలతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. గోపవరం వద్ద నాగేంద్రపురం సెంటర్‌లో భారీ గుంత పడి వాహనదారులకు చుక్కలు చూపిస్తోంది. వర్షం కురిసినప్పుడల్లా ఈ గుంతల్లోకి వరదనీరు చేరి గుంతలు ఎంత లోతు ఉన్నాయో తెలియకపోవడంతో వాహనాలు అందులోకి దిగడంతో దెబ్బతింటున్నాయి. ఇప్పటికైనా పాలకులు స్పందించి నూతన రహదారి నిర్మాణాన్ని చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నూతన రోడ్డు నిర్మించాలి



నూజివీడు నుంచి ముసునూరు మీదుగా ఏలూరు వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. ఈ మార్గం నూజివీడు, ముసునూరు ప్రజలకు ఎంతో ప్రధానమైనది. మండల కేంద్రంతో పాటు జిల్లా కేంద్రానికి వెళ్లడానికి ఇదే ప్రధాన రహదారి కావడంతో ప్రజలు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– నిమ్మగడ్డ నరసింహ, సీపీఐ నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి

రహదారిని అభివృద్ధి చేయాలి



కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడిచినా ఇంత వరకు గుంతలు పూడ్చకపోవడం దారుణం. ప్రజలు కష్టాలు పడుతున్నా కనీసం గుంతలు పూడ్చే పనులు కూడా చేపట్టలేదు. మండల కేంద్రానికి వెళ్లాలన్నా, జిల్లా కేంద్రానికి వెళ్లాలన్నా నరకం కనిపిస్తోంది. రహదారిని అభివృద్ధి చేయాలి.

– కంభాల దాసు, కాట్రేనిపాడు, ముసునూరు మండలం

నేటి నుంచి క్రీడా పోటీలు

మైలవరం: బాలబాలికలకు ఆటల పోటీలు ఈ నెల 18, 19 తేదీలలో మైలవరం మండలం చిలుకూరివారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తామని ఎంఈఓ బి. బాలు తెలిపారు. ఆటల పోటీల నిర్వహణపై చిలుకూరివారిగూడెంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అండర్ 14, అండర్ 17 బాలబాలికల ఆటల పోటీలు నిర్వహించనున్నామని చెప్పారు. అలాగే ఈ నెల 22న అన్ని కేటగిరీల బాలబాలికలకు అథ్లెటిక్స్ పోటీలను స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తామన్నారు.

రేపటి నుంచి మండల స్థాయిలో..

విస్సన్నపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మండల స్థాయి ఆటల పోటీలు మండలంలోని నరసాపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 19, 20 తేదీలలో జరుగుతాయని ఎంఈఓ సుధాకర్ తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ (షటిల్), చెస్, యోగా, అథ్లెటిక్స్ విభాగాల్లో అండర్ 14, అండర్ 17 క్యాటగిరీల్లో బాల,బాలికలకు ఆటల పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ మేరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల హెచ్‌ఎంలు, వ్యాయామోపాధ్యాయులతో స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

అధికారుల నియామకం

తిరువూరు: తిరువూరు డివిజనల్ స్థాయి అభివృద్ధి అధికారిగా ఏవీ రమణ నియమితులయ్యారు. చల్లపల్లి ఎంపీడీఓగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఆమె తిరువూరుకు బదిలీపై వచ్చారు. గంపలగూడెం ఎంపీడీఓగా ఎ.కొండూరు మండల పరిషత్‌లో డెప్యూటీ ఎంపీడీఓగా పనిచేస్తున్న సరస్వతి నియమితులయ్యారు. గంపలగూడెం ఇన్‌చార్జి ఎంపీడీఓ దాకరపు బాబూరావు పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీపై వెళ్లారు. జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ తిరువూరు సహాయ ప్రాజెక్టు డైరెక్టర్‌గా వి. పార్థసారథి బాధ్యతలు చేపట్టారు.

అధికారుల గైర్హాజరుపై సభ్యుల ఆగ్రహం

అభివృద్ధి పనుల వివరాలు ఎవరు చెబుతారంటూ నిలదీత

నూజివీడు: మూడు నెలలకొకసారి నిర్వహించే మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు పలువురు గైర్హాజరవడంపై జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు ఆగ్రహం వ్యక్తంచేశారు. వారం రోజుల ముందే మండల సర్వసభ్య సమావేశం ఉందని తెలియజేస్తున్నా ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. ఎంపీపీ ఆరేపల్లి శిరీష అధ్యక్షతన బుధవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కృష్ణంరాజు మాట్లాడుతూ ప్రజా సమస్యలు చెబుదామంటే అధికారులు రారని, గత సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన సమస్యలను ఏం చేశారో చెప్పాలన్నారు. గ్రామాల్లో మండల పరిషత్ నిధులతో చేపట్టే పనుల వివరాలను కూడా కనీసం ఎంపీటీసీలకు తెలియజేయడం లేదన్నారు. పార్టీలకతీతంగా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. దేవరగుంట, పోలసానపల్లి ఎంపీటీసీలు మాట్లాడుతూ పోలసానపల్లిలో ఎస్సీ, బీసీ ఏరియాల్లో సీసీ డ్రెయినేజీలు లేక రోడ్ల వెంట మురుగునీరు నిల్వ ఉండి దోమల బెడద ఎక్కువగా ఉందన్నారు. ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్ మాట్లాడుతూ మండల పరిషత్ నిధులతో పలు గ్రామాల్లో ఎస్సీ, బీసీ ఏరియాల్లో సీసీ డ్రెయిన్లు నిర్మిస్తున్నారన్నారు. అనంతరం పలు ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు.



మాట్లాడుతున్న జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు

సమావేశంలో పలువురు ప్రైవేటు వ్యక్తులు

మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పలువురు ప్రైవేటు వ్యక్తులు కూడా పాల్గొనడం గమనార్హం. వాస్తవంగా ఎంపీటీసీలు, సర్పంచిలు, సంబంధిత అధికారులు మాత్రమే సమావేశానికి హాజరుకావాలి. దానికి విరుద్ధంగా ఎంపీటీసీలు, సర్పంచిలతో పాటు వారి భర్తలు సైతం సమావేశంలో కూర్చోవడంపై పలువురు ఎంపీటీసీలు విస్మయం చెందారు. ప్రైవేటు వ్యక్తులు వచ్చి సమావేశంలో కూర్చున్నా అధికారులెవరూ పట్టించుకోకపోవడం గమనార్హం. సమావేశంలో వైస్ ఎంపీపీ దండుబోయిన స్వర్ణలత, డీఎల్‌డీఓ వెంకటరత్నం, ఎంఈఓ-2 సంగెపు జమలయ్య, ఏఓ పలగాని చెన్నారావు, కో–ఆపరేటివ్ అధికారి కె. నాగలక్ష్మి, ఏపీఓ మీనాక్షి, ఏపీఎం పచ్చిగళ్ల ప్రసాద్, పలువురు ఎంపీటీసీలు, సర్పంచిలు పాల్గొన్నారు.

మహిళలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు లక్ష్యం

మంత్రి కొలుసు పార్థసారథి

ఆగిరిపల్లి: స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కొలుసు పార్థసారథి కోరారు. ఆగిరిపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం మంత్రి కొలుసు పార్థసారథి స్వస్థ నారీ స్వశక్తి పరివార్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తామని, మహిళలు ఈ వైద్య సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. వైద్య శిబిరాల్లో మహిళల్లో గుండెజబ్బులు, మధుమేహం, నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్లకు ఉచితంగా పరీక్షలు చేసి వైద్య చికిత్సలు అందిస్తారని వివరించారు. కార్యక్రమంలో నూజివీడు సబ్ కలెక్టర్ బి.వి నూత్న, తహసీల్దార్ పీఎస్వీ ప్రసాద్, ఎంపీడీఓ బి.భార్గవి, వైద్యులు జాస్తి జగన్‌మోహన్‌రావు పాల్గొన్నారు.



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

వేపనూనె పిచికారీతో పత్తిలో పురుగు నివారణ

మైలవరం: పత్తిలో పురుగు నివారణకు తప్పనిసరిగా వేపనూనెను పిచికారీ చేయాలని ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎం. రవికిశోర్ అన్నారు. మైలవరం వ్యవసాయ శాఖ కార్యాలయంలో గరికపాడు డాక్టర్ కేఎల్ రావు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో అధిక సాంద్రతలో పత్తి పండించే రైతులకు శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పత్తిలో కలుపు యాజమాన్య పద్ధతులు, ఉపయోగించే ఎరువుల మోతాదు, మొక్కల పెరుగుదల నియంత్రకాలను వివరించారు. గులాబీ రంగు పురుగు నియంత్రణకు లింగాకర్షక బుట్టలు ఎకరానికి నాలుగు చొప్పున వేసుకోవాలని సూచించారు. చివరిగా దూది తీసేటప్పుడు కాటన్ సంచులు మాత్రమే ఉపయోగించాలని, ఎరువుల గోనె బస్తాలను ఎట్టి పరిస్థితుల్లో ఉపయోగించరాదన్నారు. దూదిపై ఎట్టి పరిస్థితుల్లో నీటిని పిచికారీ చేయరాదని చెప్పారు. మైలవరం మండలం చంద్రాల గ్రామంలో రైతులతో కలిసి క్షేత్ర సందర్శన చేశారు. మండల వ్యవసాయాధికారి కె.సంధ్యారాణి, సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ ఎం. రాజశేఖర్, బి.శోభితారాణి, వై. సాయిగోపి, బి.జగదీష్, వీఏఏ సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.



చంద్రాలలో పత్తి చేలను పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

ఆరోగ్యంపై మహిళలు శ్రద్ధ వహించాలి

తిరువూరు: మహిళలు తమ ఆరోగ్య సంరక్షణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని చౌటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి కనకదుర్గాభవాని అన్నారు. స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా తిరువూరు మండలంలోని చౌటపల్లి, రాజుగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, తిరువూరు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, క్షయ వ్యాధులకు ఎక్కువగా మహిళలు గురవుతున్నందున వీటి బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వైద్యాధికారి వివరించారు. మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. తిరువూరు యూపీహెచ్‌సీ వైద్యాధికారి రేష్మాబేగం, రాజుగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి చలపతిరావు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

- **కలగర(విస్సన్నపేట):** స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం మహిళల ఆరోగ్య పరిరక్షణకు ఏర్పాటు చేశారని తహసీల్దార్ కె. లక్ష్మీకల్యాణి అన్నారు. తెల్లదేవరపల్లి పీహెచ్‌సీ పరిధిలో కలగర గ్రామంలో బుధవారం స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా మహిళలకు వైద్యసేవలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ వైద్య సేవలు అక్టోబర్ 2వ తేదీ వరకు కొనసాగుతాయని చెప్పారు. వైద్యాధికారి కె. శ్రీనివాసరావు, డాక్టర్ అశ్వనీదత్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



తిరువూరు యూపీహెచ్‌సీలో మాట్లాడుతున్న వైద్యాధికారి రేష్మాబేగం

పోషకాహారంపై అవగాహన

జి.కొండూరు: మండల పరిధి వెలగలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పోషకాహారంపై సీడీపీఓ పుష్పలత అవగాహన కల్పించారు. సర్పంచ్ యర్రగుంట మార్తమ్మ, వైద్యాధికారి డాక్టర్ నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యం మెరుగుపరిచేందుకు కృషి ..

నూజివీడు: మహిళల ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకే కేంద్ర ప్రభుత్వం స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని పట్టణంలోని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజారాణి అన్నారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో బుధవారం మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 22న ఏరియా ఆస్పత్రిలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశామని చెప్పారు. బీపీ, షుగర్, రక్తహీనత, టీబీ, ఓరల్, బ్రెస్ట్, సర్వైకల్ కేన్సర్ తదితర వాటికి స్క్రీనింగ్ నిర్వహిస్తారన్నారు. ఆర్ఎంఓ డాక్టర్ వి. శ్రీనివాస్, వైద్యులు పాల్గొన్నారు.



నూజివీడులో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజారాణి

- **చాట్రాయి:** చీపురుగూడెంలో మంగళవారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. చీపురుగూడెంలో 122 మంది మహిళలకు, చిన్నంపేటలో 90 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. చనుబండ పీహెచ్‌సీ వైద్యాధికారి దుర్గాప్రసాద్, చాట్రాయి పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

తృణ ధాన్యాలతో మెరుగైన ఆరోగ్యం

ముసునూరు: తృణ ధాన్యాల వంటి ఆహారంతో మెరుగైన ఆరోగ్యం సాధ్యమని, గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుతున్న పోషకాహారం వినియోగించుకుని రక్తహీనతను దూరం చేసుకోవాలని ముసునూరు, రమణక్కపేట పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ షకీనా ఇవాంజిలిన్, డా.రమ్య అన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు.
ముసునూరు కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలకు వైద్యులు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోషకాహార ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాల్లో తహసీల్దార్ డి.ప్రశాంతి, ఎంపీహెచ్‌ఈఓ మురళీమోహన్, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.



తృణ ధాన్యాల ప్రదర్శనను తిలకిస్తున్న వైద్యులు

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

నూజివీడు: మండలంలోని మర్రిబంధం నుంచి ఎంఎస్‌పాలెం మీదుగా పల్లెర్లమూడి వరకు రూ.2.54 కోట్లతో నిర్మించనున్న రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో జెడ్పీ పరిధిలో రూ.3.55 కోట్లతో రహదారులు, సీసీ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టామన్నారు. తొలుత పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీని సందర్శించి ముంపు సమస్యను పరిష్కరిస్తానని స్థానికులకు హామీ ఇచ్చారు. అనంతరం తుక్కులూరులో ఇటీవల రామిలేరులో పడి మృతిచెందిన బడిపాటి నీరజ కుటుంబాన్ని మంత్రి పరామర్శించారు.

లబ్ధిదారుకు బీమా చెక్కు అందజేత

ముసునూరు: ప్రధాన మంత్రి బీమా యోజనలో సభ్యులుగా ఉన్న వారిని ప్రభుత్వం ఆదుకుంటుందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అక్కిరెడ్డిగూడెం బ్రాంచ్ మేనేజర్ రాచప్రోలు ప్రవీణ్ కుమార్ అన్నారు. చెక్కపల్లి గ్రామానికి చెందిన దూదిగం రంగారావు పీఎంజేజేబీవై పథకంలో సభ్యునిగా ఉన్నాడు. అతను ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో నామినీగా ఉన్న అతని భార్య సుధారాణికి బుధవారం రూ.2 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థినుల ప్రతిభ

ముసునూరు: విద్యతోపాటు వివిధ పోటీల్లో తమ విద్యార్థినులు ప్రతిభ చూపారని ముసునూరు బాలికల గురుకులం ప్రిన్సిపాల్ లక్ష్మీకుమారి అన్నారు. ఎస్‌సీఈఆర్టీ, వారధి ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి వ్యాస రచన పోటీల్లో విద్యార్థినులు ఎం.లక్ష్మి, ఎల్.అనూ, ఎం.చాందిని ద్వితీయ స్థానం సాధించారని చెప్పారు. విద్యార్థినులను పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించారు.

పాఠశాల భవనాలు ప్రారంభం

తిరువూరు: మండలంలోని గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలకు నూతనంగా నిర్మించిన భవనాలను ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు. దాతల సహకారంతో సేకరించిన స్థలంలో సమగ్ర శిక్షాభియాన్ నిధులతో నిర్మించిన భవనాలకు, తరగతి గదులకు ప్రారంభోత్సవం చేశారు. ఎంపీపీ గద్దల భారతి, ఎంఈఓ శ్యాంసుందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

మైలవరం(జి.కొండూరు): మండల పరిధి చంద్రగూడెం గ్రామంలోని ఓ ప్రైవేట్ రియల్ ఎస్టేట్ వెంచర్‌లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై మైలవరం పోలీసులు బుధవారం దాడి చేశారు. ఎస్ఐ సుధాకర్ మాట్లాడుతూ పేకాట నిర్వహిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.16,500 నగదును స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేశామని చెప్పారు.

గ్రంథాలయానికి కుర్చీల వితరణ

తిరువూరు: తిరువూరు గ్రేడ్–1 శాఖా గ్రంథాలయానికి ఆర్య వైశ్య సమాజ అధ్యక్షుడు గుడిమెట్ల మురళి ఫైబర్ కుర్చీలను వితరణ ఇచ్చారు. బుధవారం గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో పాఠకుల అవసరాల మేరకు కుర్చీలను గ్రంథాలయాధికారి పద్మావతికి అందజేశారు. ఆర్య వైశ్య సంఘం, వాసవీ క్లబ్‌ల సభ్యులు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

మైలవరం: మైలవరం మండలం చంద్రాల గ్రామం వద్ద ఆర్టీసీ బస్‌కు తృటిలో పెను ప్రమాదం తప్పింది. నూజివీడు నుంచి 40 మంది ప్రయాణికులతో ఆర్టీసీ పల్లె వెలుగు బస్ మైలవరం బయలుదేరింది. చంద్రాల గ్రామం దాటిన తరువాత రహదారిపై ఏర్పడిన గుంతలను డ్రైవర్ తప్పించే క్రమంలో పంట పొలాల్లోకి బస్సు దూసుకు వెళుతూ రోడ్డు మార్జిన్‌లో ఆగింది. దీంతో బస్‌లో ఉన్న ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఈ క్రాప్ తప్పనిసరి

చాట్రాయి: రైతులు తప్పనిసరిగా తమ పంటలను ఈ క్రాప్ చేయించాలని వ్యవసాయ అధికారి బి. శివశంకర్ అన్నారు. పోతనపల్లిలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కురిసిన వర్షాలకు పొలంలో ఎక్కువగా ఉన్న నీటిని బయటకు పంపాలని, ఉదయం కురుస్తున్న మంచుకు అగ్గి తెగులు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. అగ్గి తెగులు నివారణకు 0.6 గ్రాముల ట్రైక్లోజోల్‌ని ఒక లీటరు నీటిలో కలిపి లేదా ఇసోప్రోతాయెలెన్ 1.5 మిల్లి లీటర్లు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పలువురు రైతులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు

ఇబ్రహీంపట్నం: మండలంలో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం రెండో రోజు బుధవారం నిర్వహించారు. వివిధ పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గార్లపాటి అనుగ్రహ ప్రసాద్ మాట్లాడుతూ పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. బోధనేతర పనులు నుంచి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి బసవయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు శ్యామ్‌ప్రసాద్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోపాలకృష్ణ, ప్రమీలారాణి పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి గట్కా పోటీల్లో జెడ్పీ విద్యార్థుల ప్రతిభ



ఇబ్రహీంపట్నం: విజయవాడ లయోలా కళాశాలలో ఈనెల 15, 16 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి గట్కా పోటీల్లో పశ్చిమ ఇబ్రహీంపట్నం జెడ్పీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారని పాఠశాల హెచ్‌ఎం సంతోష్‌కుమార్ బుధవారం తెలిపారు. వివిధ విభాగాల్లో 8, 9 తరగతి విద్యార్థులు ఎ.అరవింద్, ఎస్‌కే కరిష్మా, ఎం.గణేష్ బంగారు పతకాలు, కె.క్రాంతికుమార్ కాంస్య పతకం సాధించారన్నారు. అక్టోబర్ 10 నుంచి 14వ తేదీ వరకు చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో జరుగనున్న జాతీయ స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని చెప్పారు. విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు పీడీ రాజశేఖర్, ఉపాధ్యాయులు అభినందించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు ఆపాలని వినతి



జి.కొండూరు: చెవుటూరు ప్రభుత్వ పాఠశాల పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటును ఆపాలంటూ గ్రామస్తులు స్థానిక విద్యుత్ శాఖాధికారులకు బుధవారం వినతిపత్రం అందజేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ పాఠశాల పక్కన ట్రాన్స్‌ఫార్మర్ ఉంటే విద్యుత్ ప్రమాదాలు జరిగినప్పుడు పిల్లల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలకు దూరంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసేందుకు అధికారులు ఆలోచన చేయాలని కోరారు.

దళితులపై దాడుల నివారణలో ప్రభుత్వాలు విఫలం

బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుష్పరాజ్



ఇబ్రహీంపట్నం: దళితులపై దాడుల నివారణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చలకూర పుష్పరాజ్ అన్నారు. ఇబ్రహీంపట్నంలో జిల్లా అధ్యక్షులు దొండపాటి శామ్యూల్ కుమార్ అధ్యక్షతన బుధవారం జరిగిన దళిత రణభేరి సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులపై దాడులకు నిరసనగా ఈనెల 24న విజయవాడలో జరుగనున్న దళిత రణభేరి ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. నియోజకవర్గ అధ్యక్షుడు జి. వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జి కుక్కమల్ల కోటేశ్వరరావు, గుమ్మడి శ్రీనివాసరావు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు నల్లమోతు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు నగదు ప్రోత్సాహకాలు పంపిణీ



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): పెట్ల పార్వతి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ తరగతి ప్రథమ స్థానాల్లో నిలిచిన బాలికలకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. కొండపల్లి క్రాంతి హైస్కూల్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో రూ.30 వేలు నగదును 40 మంది బాలికలకు మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు పంపిణీ చేశారు. 18 ఏళ్లుగా పెట్ల పార్వతి వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తూ బాలికలకు నగదు ప్రోత్సాహకాలు పంపిణీ చేస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ పి.కామేశ్వరరావు తెలిపారు. ట్రస్ట్ గౌరవాధ్యక్షురాలు జోనీకుమారి, మాజీ సర్పంచి వెనిగళ్ల అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

చీపురుగూడెంలో పారిశుధ్య పనులు



చాట్రాయి: చీపురుగూడెం పంచాయతీ ఆధ్వర్యంలో మంగళవారం పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని ఇటీవల కురిసిన వర్షాలకు డ్రెయినేజీల్లో నీరు నిలిచిపోయింది. దీంతో డ్రెయినేజీల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించి వరద నీటిని బయటకు పంపించారు.